విశాలాంధ్ర కృష్ణా జిల్లా

చెరకుకు మద్ధతు ధర రూ.3.4 వేలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: కే.సి.పి.యాజమాన్య 2023-24 సీజన్లో రైతులకు చెఱకు మద్దతు ధర టన్నుకు రూ.3464.75లుగా ఇవ్వనున్నట్లు కే.సి.పి.యాజమాన్య యూనిట్ హేడ్ వై.సీతారామదాసు ప్రకటించారు.మంగళవారం కే.సి.పి.కర్మాగారములో చెరకు రైతులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వై.సీతారామదాసు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం టన్ను కు రూ.2919.75లు ప్రకటించగా, కంపెనీ ప్రోత్సాహక ధరగా రూ.145 లు వెరసి 3064.75లు కాగా టన్ను కి సబ్సిడీ తో కలిపి రైతుకి మొత్తం గా టన్ను కి రూ.3464.75 గిట్టుతుందని తెలిపారు. 2024-25 సంవత్సర సీజన్లో సాంప్రదాయ పద్ధతిలో నాటిన చెరకు తోటలకు టన్ను ఒక్కంటికి రూ.400 సబ్సిడీ, యాంత్రిక పద్ధతిలో నాటిన చెరకు తోటలకు సబ్సిడీ టన్ను కి రూ.500లు ప్రకటించారు.ఈ సమావేశంలో

రైతు నాయకులు ఎస్.వి.కృష్ణారెడ్డి, జె.మోహన్ రెడ్డి, వేమూరి రత్నగిరి రావు, పులి శ్రీనివాసరావు, చాగంటి తిమ్మారెడ్డి, ఎం.ధనకోటేశ్వరరావు, కె.సి.పి.జి.యం.వి.వి.పున్నారావు, డి.జి.యం.ఎం.సూర్యారావు, చెరకు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలంలోని 16 సచివాలయాలలో 21 గ్రామాల్లో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి, 158 సర్వీసులు అదనపులోడు ఉన్నాయని అన్నారు. మండలం మొత్తంలో 2271 సర్వీసులను మచిలీపట్నం డివిజన్ 38 బృందాలు తనిఖీలు చేశారు. అదనపులోడు వినియోగించుకుంటున్న 158 సర్వీసులకు రూ.4.54 లక్షల అపరాధ రుసుము విధించినట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ పామర్రు డిప్యూటీ ఇంజనీర్ కే సుందరరావు తెలిపారు. విజిలెన్స్ ఈ.ఈ. వెంకటేశ్వరరావు, మచిలీపట్నం డివిజన్ ఈ.ఈ. భాస్కరరావు నాయకత్వం వహించారు.

పేదలకు ఆరోగ్యమే ధ్యేయం : డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర-కూచిపూడి : సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యమే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారని ధ్యేయమని డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణలో భాగంగా మంగళవారం నిడుమోలు పీహెచ్‌సీ పరిధిలోని కాజ-1 సచివాలయంలో వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ గ్రామ మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ కొడాలి భవాని ప్రారంభించారు. 600 మందికి పైగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసిన శిబిరాన్ని వైద్యాధికారులు డాక్టర్ సిహెచ్ సోమరాజు, డాక్టర్ ఏ సాయి కిరణ్, డాక్టర్ ఎం వేదరాజ్, డాక్టర్ విజయ్ శ్రీలు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీతాబాయి (మచిలీపట్నం)పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో, సిబ్బందితో, రోగులతోనూ మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పేకేటి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ మందా శ్రీనివాసరెడ్డి, తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎండీవో జి సుధాప్రవీణ్ పర్యవేక్షించగా, కాజపంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి ఏ డి వి ఎల్ ప్రసాద్,పీహెచ్సీ పరిధిలోని ఏడు సచివాలయాల ఏఎన్ఎంలు, సి హెచ్ ఓ లు, ఆశా వర్కర్స్, సచివాలయ సిబ్బంది, సహకరించారు.

సంక్షేమ పథకాలు అమలు : మంత్రి జోగి

విశాలాంధ్ర-పెడన : రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఎంతో మంచి చేస్తున్న జగనన్నను మరువద్దని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కోరారు. పెడన మండలం నడుపూరు సచివాలయ పరిధిలో బుధవారం నెరికేపాలెం, కొత్తకాలనీ, కూదూరులలో పర్యటించి "గడపగడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నడుపూరులో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్ భవనాలను, కూదూ రులో రూ.23.94 నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఓటీఎస్ పథకం కింద నడుపూరులో లబ్ధిదారులు గడ్డం ఉదయలక్ష్మి, బొందాడ శేషమ్మ తదితరులకు మంత్రి ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో మీకు ఇంటి కాగితాలేమీ లేవు, జగనన్న మీకు రూ.10 లక్షల విలువచేసే ఆస్తి మీ పేరట రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులు అందజేస్తున్నారని, ఇంటిపై బ్యాంకు రుణాలు పొందవచ్చు, క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు, వారసులకు బహుమతిగా ఇవ్వొచ్చని మంత్రి లబ్ధిదారులకు సూచించారు. నడుపూరు కొత్త కాలనీలో రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు మంత్రిని కోరగా, సి సి రోడ్డు వేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలో అక్కడక్కడ రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేయించా లని మంత్రిని కోరారు. జనవరి నుండి పింఛన్లు రూ.3 వేలకు పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అచ్యుతరావు, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ చారుమతి, సర్పంచ్ చీర్ల అనూష, పెనుమల్లి సర్పంచ్ రామానాయుడు, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ కాగిత వెంకటేశ్వరరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు దావు భైరవలింగం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, ఆర్‌బికే చైర్మన్ సింగంశెట్టి రాంబాబు, ఎంపీడీవో రెడ్డయ్య, స్థానిక నాయకులు మండల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌దే లక్ష్యం : రాజ్యలక్ష్మి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికి సమగ్ర వైద్య సేవలు అందజేస్తున్నారని డిప్యూటీ కలెక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష పర్యవేక్షణ ప్రత్యేకాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం చోరంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డిప్యూటీ కలెక్టర్ రాజ్యలక్ష్మి మాట్లడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఇంటి దగ్గరే బిపి, హెచ్ బి, డయాబెటిస్, మలేరియా, వంటి ఆరోగ్య పరీక్షలు చేసి తగిన వైద్య సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కుమారుడు జోగి రాజీవ్, వైద్యులు అనురుద్ ఆర్థోపెడిక్, అచ్యుత్ పిల్లల డాక్టరు, కంటి వైద్య నిపుణులు ప్రవీణ్, బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చినబాబు, ఎంపిటిసిటి లక్ష్మి, రేవు గోపాల కృష్ణ, వైసీపీ అధ్యక్షులు స్తునం మహేష్, వైఎస్సార్ పార్టీ నాయకులు మలిశెట్టి రాజబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

విశాలాంధ్ర-గుడివాడ : స్టేట్ బార్ కౌన్సిల్ న్యాయవాదులను సంప్రదించకుండా ఏకపక్షంగా ప్రవేశపెట్టిన రూ. 20 రూపాయల వెల్ఫేర్ స్టాంపు విధానానికి వ్యతిరేకంగా స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం ఏలూరురోడ్లలోని కోర్టు సముదాయల వద్ద బార్ అసోసియేషన్ అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి చెన్నూరు వెంకటరమణ మాట్లాడుతూ స్టేట్ బార్ కౌన్సిల్ ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా న్యాయవాదులకు భారంగా ఉండే 20 రూపాయల వెల్ఫేర్ స్టాంపు విధానాన్ని ప్రవేశపెట్టడం దారుణమన్నారు. స్టేట్ బార్ కౌన్సిల్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబర్ 10వ తేదీ నుండి 20వ తేదీ వరకు పది రోజులపాటు న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ బార్ సోసియేషన్ సభ్యులు షేక్ మొహమ్మద్ రఫీ, వై.రవీంద్రనాథ్, చోరగుడి కుటుంబరావు, చేట్టుబాదుల సుర్యారావు, దాసరి సుధాకర్, కంభంపాటి రవి, మహిళా న్యాయవాదులు నాగమణి, విమల తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో తోటమూల విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర-పెడన : జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలలో నియోజకవర్గ స్థాయిలో విద్యార్థుల ఎంపిక ది10-10-2023 న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గూడూరు నందు జరిగినది. ఈ పోటీలో యందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తోటమూల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. అండర్ 14 బాలుర విభాగంలో 8వ తరగతి విద్యార్థి పి. శ్రీ చరణ్ 100, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో, షాట్ పుట్ నందు మూడో స్థానాన్ని సాదించాడు. 600 మీటర్ల పరుగులో డి.జితేంద్ర రెండవ స్థానాన్ని సాధించాడు. నియోజకవర్గ స్థాయిలో ఇంతటి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో పోటీలకు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను, వీరికి శిక్షణ నిచ్చి పాఠశాలను అగ్రస్థానంలో నిలిపిన వ్యాయామ ఉపాధ్యాయులు గందు నరసింహారావు ని ప్రధానోపాధ్యాయులు చింతలపాటి నాగేశ్వరావు మరియు ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్‌లు వితరణ

విశాలాంధ్ర-పమిడిముక్కల: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల -ఐనపూరు లో శ్రీ షిరిడి సాయి బాబా సేవా ట్రస్టు అధ్యక్షులు దొడ్డా పూర్ణ చంద్రరావు విద్యార్థులకు వ్రాసుకును అట్టలు పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలోని విద్యార్థులకు దాత రూ.12 వేల విలువ చేసే రైటింగ్ ప్యాడ్స్ సుద్ద ముక్కలు, డస్టర్లు, పెన్నులు పంపిణీ చేసి, ఇచ్చిన వస్తువులను విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎ.కె.స్వామి తదితరులు పాల్గొన్నారు.

నోటీసు ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, గుడివాడ వారి కోర్టులో

ఇ.పి నెం. 81/2022 ఇన్ ఓ.ఎస్ నెం.133/2019

బిట్వీన్ :

లాము కోటేశ్వరరావు - డిహెచ్ఆర్ (డిక్రి హోల్డర్)

మరియు

పెరుమాళ్ళ రమణ - జెడిఆర్ (జడ్జిమెంట్ డెటార్)

జెడిఆర్ : పెరుమాళ్ళ రమణ, భర్త వెంకట రంగరావు హిందువు, వయస్సు 38 సం॥రాలు నివాసం డోర్ నెం. 22-6 గాంధీ నగర్, పామర్రు గ్రామం, పామర్రు మండలం కృష్ణాజిల్లా.

పై నెంబరు గల ఇ.పి.లో జెడిఆర్ (జడ్జిమెంట్ డెటార్) అయిన మీకు ఎన్ని పర్యాయములు ఆర్డర్ 21 రూల్ 54 నోటీసులు పంపించిననూ తీసుకోనకుండా కాలయపన చేస్తూ ఉన్నారు. కావున పై నెంబర్ గల ఇ.పి.లో మీ యొక్క హాజరు నిమిత్తం ది. 19-10 -2023వ తేదీ వాయిదా వేశియున్నారు. కాబట్టి వాయిదా రోజున ఉదయం గం॥10.30ని॥ లకు స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలేను లేని యెడల మి పరోక్షంగా విచారణ జరిపి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : 19-10-2023

రావూరి రవి కుమార్, న్యాయవాది, గుడివాడ. సెల్ :9985117543.

గుడివాడ, 10-10-23

ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియా రాష్ట్ర అధ్యక్షుడిగా తారక ప్రసాద్

విశాలాంధ్ర-హనుమాన్‌జంక్షన్

ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియా రాష్ట్ర అధ్యక్షులుగా హనుమాన్ జంక్షన్‌కు చెందిన డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. రాష్ట్ర మత్తు వైద్యుల సంఘం 32వ వార్షిక సదస్సు ఈ నెల 6, 7, 8తేదిలలో విశాఖపట్నంలో జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వెయ్యి మంది మత్తు వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన తారక ప్రసాద్ పలువురు అభినందించారు.

వంతుల వారీగా సాగునీరు

విశాలాంధ్ర-అవనిగడ్డ : నాగాయలంక, కోడూరు పంట కాలువలకు సాగునీరు వంతుల వారి విధానంతో ఇరిగేషన్ అధికారులు ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటి నుండి విడుదల చేస్తున్నారు. అయితే 10 రోజులుగా వంతుల వారి విధానంలో పూర్తి స్థాయిలో సాగునీటిని విడుదల చేయకపోవడంతో దివిసీమ రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతుల వారి విధానంతో 3 1/2 రోజులు నాగాయలంక ప్రధాన పంట కాలువకు, 3 1/2 రోజులు కోడూరు ప్రధాన పంట కాలువకు సాగు నీరు అందిస్తామని చెప్పిన అధికారులు వారు ఇచ్చిన మాట ప్రకారం కూడా సాగు నీటిని అందించలేక చేతులు ఎత్తేస్తున్నారు. గత రెండు రోజుల నుండి కోడూరు పంట కాలువకు సాగు నీటిని వంతుల వారి విధానంలో నీటిని విడుదల చేశారు కానీ పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడంతో రైతుల కష్టాలు ప్రారంభం అయ్యాయి. గత వారం రోజులుగా సాగునీటి పరిస్థితి నాగాయ లంక- కోడూరు పంటకాలువకు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. అవనిగడ్డ లాకులకు కోత వేటు దూరంలో ఉన్న పంట పోలాలు సైతం నీరు అందకపోవడంతో పంట పొలాలు నెరలిస్తున్నాయి. అవనిగడ్డ లోని పంట పోలాల పరిస్థితి ఈ విధంగా ఉంటే నాగాయలంక, కోడూరు పంట కాలు వల చివరి భూముల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చే గడిచిన 15 రోజులుగా వర్షపాతం కూడా నమోదు కాకపోవడం పంట కాలువల ద్వారా సాగు నీటిని పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవ డంతో రైతుల పరిస్థితి అగమ్యఘోచరంగా మారింది. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి సాగు నీటిని మాత్రం విడుదల చేయడంలో మీనమీసాలు లెక్కబెడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించి రైతులను ఆదుకోవాలని దివి రైతాంగం కోరుతున్నారు.

పెదల ఆరోగ్యమే ధ్యేయం : ఎమ్మెల్యే వంశీ మోహన్

విశాలాంధ్ర-గన్నవరం : పేద ప్రజలు జగనన్న సురక్ష క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మంగళవారం మండలం లోని గొల్లనపల్లి గ్రామ సచివాలయంలో జగన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే వంశీమోహన్ సర్పంచి గణపవరపు శాంతి, యంపిటి మోరం నాగమణి, ప్రారంభించారు.ఈ సందర్భంగా వంశీ మోహన్ మాట్లాడుతూ రాష్టంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం ఉండాలని లక్ష్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమ చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు అన్నవరపు ఎలిజబెత్ రాణి, యంపీపీ అనగాని రవి,సర్పంచి గణపవరపు శాంతి,యంపిటిసి మొరం నాగమణి, పడమట సురేష్, గణపవరపు వెంకయ్య, కోటగిరి వెంకట్రావు నీలం బాలు,పొలిమెట్ల జయరాజు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో' ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం 'సందర్భంగా కూచిపూడి లోని ఎస్సీ బాలికల ప్రభుత్వ హాస్టల్లోవిద్యార్థినులకు మంగళవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ పి హెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని మెంటల్ హెల్త్ (మానసిక ఆరోగ్యం)గురించి విద్యార్థినులకు అనేక విషయాలు వివరించారు. శారీరక ఆరోగ్యం తో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని చిన్న చిన్న విషయాలకు తొందరపాటు చర్యలు తీసుకోరాదని హెచ్చరించారు. విద్యార్థినులు చిన్న వయసు నుంచే చదువుతోపాటు పలు విషయాలలోఎంతో ఒత్తిడికి గురవుతూ మానసికంగా ఎన్నో ఒడిదుడుకులను, ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కే రామాంజనేయులు, సంజీవని హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జె హనుమకుమార్, రోటరీ క్లబ్ పిఆర్వో పాగోలు రమేష్ బాబు,హెచ్.వి. విజయ కుమారి, కూచిపూడి సచివాలయ ఏఎన్ఎం వసుంధర, సబ్ సెంటర్. సిహెచ్ఓ కే దివ్య,వైద్య సిబ్బంది హాస్టల్ వార్డెన్ టీ శైలజ పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : కులమత బేధాలు లేకుండా అన్ని వర్గాల వారికి చేయూతలందిస్తూ, ప్రోత్సాహం కల్పిస్తూ, ఆదరణనందిస్తూ వారిలో మానవత్వం, వివేకం, బాధ్యత, ప్రేమ, సేవ విలువలను తెలియచేస్తూ ఆధ్యాత్మిక ధార్మిక జాగృతిని కలిగిస్తున్న శ్రీ ధర్మ పరిషత్ మహా సంస్థాన్ ఆధ్వర్యంలో అయోధ్య నగర్ శ్రీ శివ కామేశ్వరి సమేత నీల కంఠేశ్వరస్వామి వార్ల మందిరంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవములు నిర్వహిస్తున్నట్లు మహా సంస్థాన్ వ్యవస్థాపకులు హేమ సుందర వరప్రసాద్(రాజా) తెలిపారు. ఉత్సవముల పది రోజులు త్రైలోక్యమాత పది అవతారాలలో అలంకరించుకొని భక్తులకు దర్శనమిస్తుందని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం సంగీత నృత్య కళా ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. 23 వ తేదీ రాత్రి శమీ పూజ, గ్రామోత్సవం, 24 ఉదయం సాయినాధుని వ్రతం, సాయంత్రం శ్రీ శివ కామేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి వార్లకు శాంతి కళ్యాణం,రథోత్సవం జరుగుతాయని తెలిపారు.

సామాన్యులందరికీ వైద్యసేవలే లక్ష్యం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం సామాన్య, పేద కుటుంబాలకు చెందిన ప్రజలందరికీ ఉన్నత వైద్యసేవలందించే లక్ష్యంతోనే సురక్ష పథకం ప్రారంభించిందని ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి అన్నారు. మండలంలోని కలగర పంచాయతీలో గ్రామసర్పంచి దేశిరెడ్డి రమతో కలసి ఆమె సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలంతా ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. కార్యక్రమంలో వారితోపాటు పలువురు ప్రజలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్థ ప్రతిభా పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఖురాన్ అందరికీ మార్గదర్శకమని, సర్వమానవాళికి మార్గదర్శకమని ప్రతి ఏడాది నిర్వహించే విధంగా ఈ సం.రం కుడా రాష్ట్ర స్థాయిలో ఖురాన్ కంఠస్థ ప్రతిభా పోటీలను నిర్వహించబోతున్నామని యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మహమ్మద్ దావూద్ తెలిపారు.మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యఖురాన్ విశ్వాసుల సంబంధం పటిష్టంగా ఉండాలని, ఒకప్పుడు ముస్లిం మహిళలు నిత్యం నమాజ్ అనంతరం భక్తి శ్రద్ధలతో ఖురాన్ పారాయణం చేసే సదాచారం ఉండేదని గుర్తు చేశారు. పెద్దలు ఖురాన్ చదువుతూ ఉంటే పిల్లలు ఎంతో ఆసక్తితో వినేవారన్నారు. ఖురాన్ పఠనం ద్వారా దైవభీతి, పాపాలు చేయకూడదనే ఆలోచనలు వస్తాయని వివరించారు.ఖురాన్ పఠనాన్ని విస్మరించడం వల్ల మన జీవితాల్లో సౌభాగ్యాలు దూరమై, సమాజంలో చెడు ప్రవర్తనలు కనిపిస్తున్నా యన్నారు. అల్లాహ్ ప్రసన్ను డవ్వాలంటే ఖురాన్‌పై విశ్వాసం ఉంచి, నిత్యం పఠించాలని సూచించారు. చిన్నారులకు బాల్యం నుంచే ఖురాన్ పట్ల ఆసక్తి పెంపొందించే బాధ్యత పెద్దలే తీసుకోవాలన్నారు. ఫైనల్స్‌లో ఏబీసీడీ గ్రూపుల నుంచి పాల్గొన్న బాల బాలికలకు రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా అందిస్తామని తెలిపారు.విజయవాడ ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాల్ వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పలువరు ముస్లీం నాయకులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలిచి రిలే దీక్షలు

విశాలాంధ్ర- గుడివాడ : టిడిపి నాయకుడు చంద్రబాబు నాయుడుకు కోర్టులో న్యాయం జరిగి బయటికి రావలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో మోకాలపై నిలబడి నిరసన తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 28వ రోజు గుడ్లవల్లేరు టిడిపి నాయకుల దీక్షలను టిడిపి పట్టణ, రూరల్, నందివాడ మండల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, సర్పంచ్ కాకరాల సురేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టులో న్యాయం చంద్రబాబుకు అనుకులంగా తీర్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడుసుమిల్లి చిట్టిబాబు, బెల్లంకొండ ఏడుకొండలు, వి.నరసింహారావు, కొండా, ధనకోటి, సుత్తిబాబు, సత్తర్, రెడ్డి షణ్ముకం, మెక్కం నరసింహారావు, ఇడే మోహన్, వేశపతి, రంగారావు, బొప్పన శివప్రసాద్, వెనిగండ్ల నాగేశ్వరరావు, వి.శివప్రసాద్, గురవయ్య, అంకాలు, సత్యనారాయణ, నగన్న, వాసు, పొట్లూ రవి, పొలవరపు వెంకట్రావు, వల్లభనేని సుబ్బారావు, చలసాని శ్రీధర్, మోకా అనిల్, షేక్ జానీషరిఫ్, కొల్లి రమ్య, పొట్లూరి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : పరిసర ప్రాంతాలను పరిశుభ్రం కోసం ఎవరికి వారే నడుము బిగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అవనిగడ్డ -కోడూరు ప్రధాన రహదారి ప్రక్కన ప్రభుత్వం మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మరో ప్రక్క పంట కాలువ ఉండగా మందు బాబులు ఆర్యవైశ్య కాలనీ సమీపంలో మద్యం సేవించి బాటిల్స్‌ను అక్కడే పగులకొట్టడంతో వాహనదారులు ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు.విషయాన్ని గమనించిన ఆర్యవైశ్య యువత మంగళవారం ప్రత్యేకంగా జెసిబిని ఏర్పాటు చేసుకుని రహదారికి ఇరువైపుల ఉన్న చెత్తను, ముళ్ళ కంపను, పగిలిన గాజు సీసా ముక్కలను తొలిగించి శుభ్రం చేసుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం

బ్యాటరీతో నడిచే కార్ సేవలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వేస్టేషన్‌లో అరోగ్య సమస్యలు ఉన్న ప్రయాణికులకు ముఖ్యంగా మహిళలు,వృద్ధులు, దివ్యాంగులకు ఇతర ప్లాట్‌ఫామ్‌లకు వెళ్ళవెలసిన వారి కష్టాలకు చెక్‌పెడుతూ రైల్వే అధికారులు ప్యాసింజర్ బ్యాటరీతో నడిచే కార్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు.మంగళవారం రైల్వేస్టేషన్‌లో డిఆర్ఎం నరేంద్ర ఎ. పాటిల్ రెండు బ్యాటరీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కోసం మరో వాల్యూ యాడెడ్ సేవలను ప్రారంభించామన్నారు. ఈ బ్యాటరీతో నడిచే కార్ట్‌ల సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయి అన్నారు.ప్రయాణీకులను,వారి లగేజీని అవసరమైన ప్లాట్‌ఫారమ్‌లు/కోచ్‌లకు రవాణా చేయడంలో సహాయపడతాయి. వాణిజ్య విభాగం ద్వారా నాన్-ఫేర్ రెవిన్యూ చొరవ కింద కాంట్రాక్టు ఇవ్వబడిందన్నారు. రైలు ప్రయాణికులు మొబైల్ నంబర్ 9640694079ని సంప్రదించడం ద్వారా విజయవాడ రైల్వే స్టేషన్‌లో కేవలం రూ.50/- చొప్పున బ్యాటరీతో నడిచే కార్ట్ సేవలను పొందవచ్చు. ప్రయాణీకుల ప్రయోజనం కోసం, డిజిటల్ చెల్లింపు విధానం ద్వారా కూడా చెల్లింపు చేయవచ్చు అన్నారు.ప్రయాణీకుల నుండి వచ్చిన స్పందన ఆధారంగా మరిన్ని బ్యాటరీతో నడిచే కార్‌లను ప్రవేశపెడతామన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం రాంబాబు వావిలపల్లి, పిఆర్ఓ నుస్రత్ ఎమ్. మండ్రుప్కర్,స్టేషన్ మేనేజర్ రవి ప్రకాష్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

రాష్ట్రంలో నియంత పాలన

- ప్రజాస్వామ్యానికి పాతర వేసిన జగన్ ప్రభుత్వం
- హామీలు అమలు చేయాలని కోరితే అక్రమ అరెస్టులా..?
- నాయకుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం
- సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యానికి జగన్ ప్రభుత్వం పాతరేసిందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన మేరకు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోవాలాలకు గుదిబండలా మారిన జీవో నంబర్ 21, 31 రద్దు చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి, ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు దోనేపూడి శంకర్, సీపీఐ, యూనియన్ నాయకులు కొట్టు రమణ, గూడెల జనార్దన్, వెంకాచ్చి,టీఎన్టీయూసీ నాయకులు రఘు సహా 20 మందిని అక్రమంగా అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టడానికి పోలీసులు చర్యలు తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన చెప్పారు. వన్ టౌన్ లెనిన్ భవన్ లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం, పోలీసు చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులకు తప్పనిసరిగా స్టేషన్ బెయిల్ ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు స్పష్టంగా చెప్పినా పోలీసులు ఇవాళ స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా సీపీఐ, ఆటో యూనియన్, టీఎన్టీయూసీ నాయకులను కోర్టులో ప్రవేశ పెట్టేందుకు అత్యుత్సాహం ప్రదర్శించడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో ప్రతి పక్షాల గొంతు నొక్కడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. నిన్న విజయవాడలో వైసీపీ సదస్సు పెట్టుకుంటే తమని గృహనిర్బంధం చేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం, పోలీసులు శాంతిభద్రతలు కంట్రోల్ చేయలేని చేతగాని స్థితిలో ఉన్నారా, నిజంగా రాష్ట్రంలో అంత ఘోరమైన పరిస్థితులు ఉన్నాయా... ఎందుకోసం 144, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలు చేస్తున్నారు.. ఎంతకాలం అమలు చేస్తారు.. అని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు ఏ కార్యక్రమం చేసినా చట్టాలు వర్తించవని, ప్రతిపక్షాలు శాంతియుతంగా నిరసన తెలిపినా అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడాన్ని ప్రజలు గమనించాలని కోరారు. తక్షణమే అక్రమంగా అరెస్టు చేసిన ఆమదరిని వదిలి పెట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నగరం : మేయర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : వైసీపీ అధికారంలో నగరం అభివృద్ధిలో పయనిస్తోందని నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 4వ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాష్, మేయర్ మంగళవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.49 లక్షలతో 4వ డివిజన్ వెటర్నరీ కాలనీలోని 2వ క్రాస్ రోడ్డులో రూ.12.75లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో నూతనంగా నిర్మించు సీసీ రోడ్డు, 3వ క్రాస్ రోడ్డులో రూ.13.00లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో నిర్మించు సీసీ రోడ్డు, రూ.18.00లక్షలతో బీసీ లేయర్‌తో బీటి రోడ్డు, ఎన్టీఆర్ ట్యాంక్ రోడ్డు నుండి వీఎంసీ పార్క్ వరకు రూ.4.98లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభిచినట్లు చెప్పారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, వంటి వసతులను ఏర్పాటు చేశామని, నగరాభివృద్ధిలో భాగంగా గత నాలుగేళ్లలో కోట్లాది రూపాయల వ్యయంతో మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేషన్‌లో వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, 4వ డివిజన్ వైసీపీ ఇంచార్జ్ పద్మావతి పాల్గొన్నారు.

తమ్మిన పోతరాజు కృషి మరువలేనిది

111వ జయంతిలో జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): విజయవాడ నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించిన తమ్మిన పోతరాజు కృషి మరువలేనిదని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు కొనియాడారు. తమ్మిన పోతరాజు 111వ జయంతి కార్యక్రమం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కేబీఎస్ కాలేజీ వద్ద ఉన్న పోతరాజు విగ్రహానికి సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ్మిన పోతరాజు నగరంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి తనవంతు కృషి చేశారని, ఎందరో యువకులను, కార్మికులను కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులు చేశారని, పార్టీ బలోపేతానికి బాటలు వేశారని, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎంపికై విజయవాడ నగర అభివృద్ధి కోసం, పాతబస్తి కొండ ప్రాంతాల మౌలిక సదుపాయాల కల్పన కోసం, కృషి చేయటం ద్వారా ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారన్నారు. నేడు ఎన్నికైన ఎమ్మెల్యేలు శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించకుండా, ప్రతిపక్ష శాసనసభ్యులపై అసభ్య పదజాలాలతో, దూషణలను చేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" అనే నినాదంతో 52 మంది కమ్యూనిస్టు పార్టీ శాసనసభ్యులలో, తమ్మిన పోతరాజుతో సహా తమ శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి, విశాఖ ఉక్కు పరిశ్రమను సాధించారని గుర్తు చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్ శక్తుల లాభాల కోసం, ప్రైవేటీకరించటం దుర్మార్గమన్నారు. అందుకనే రాష్ట్ర ప్రజలు గమనించి, ప్రజల కోసం పనిచేసే, మంచి శాసనసభ్యులను ఎన్నుకోవడం ద్వారా మన ప్రాంత, రాష్ట్ర అభివృద్ధితో పాటు, దేశ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు డివి రమణబాబు, సీనియర్ పార్టీ నాయకులు కొరగంజి దుర్గాంబ, డివిజన్ పార్టీ కార్యదర్శిలు బోరా రామకృష్ణ, మురుగేషన్ రాము, ఆర్ మైఖెల్, ప్రజానాట్య మండలి నగర అధ్యక్షులు ఎస్‌కే నజీర్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్, ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు చొప్పా శ్రీరామచంద్ర మూర్తి, సింగరాజు సాంబశివరావు, తిప్పాబత్తుల వెంకటేశ్వరరావు, గాడి రాము, రాయన గురున్నాదం, దుర్గాసి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దిగ్బంధనంలో దాసరి భవన్

విశాలాంధ్ర-విజయవాడ : ఆటో కార్మికుల జేఏసీ పిలుపు మేరకు ఆటో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం రాత్రి దాసరిభవన్‌ను పోలీసుల దిగ్బంధనం చేశారు. పెద్దఎత్తున ఆటో కార్మికులను అరెస్టు చేస్తూ నగరం నలు మూలల తనిఖీలు, ఫోన్ మెసేజ్లు చెకింగ్ చేస్తూ పోలీసులు తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారు. పోలీస్ శాఖ వారు ఆటో కార్మికులకు అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ నాయకులను ఆటో డ్రైవర్లను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు విజయవాడలో ఆటో స్టాండ్ లో ఉన్న డ్రైవర్లను కూడా పోలీసులు భయభ్రాంతులకు గురి చేశారు. సీపీఐ విజయవాడ పార్టీ నగర నాయకత్వాన్ని కూడా గృహనిర్బంధాలు చేసి అరెస్టులు చేశారు. దానిలో భాగంగా పటమట లంకలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావును తన నివాసము నందు సోమవారం రాత్రి 7 గంటల నుండి మంగళవారం సాయంత్రం వరకు గృహ నిర్బంధంలో ఉంచారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు సంగుల పేరయ్యను హౌస్ అరెస్టు చేశారు. ఏఐటీయూసీ నాయకులను గృహనిర్బందించటం, అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ ఖండించారు.

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (తిరువూరు) : తిరువూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గత కొంతకాలంగా ఫ్లడ్ లైట్లు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో బస్టాండ్ ఆవరణ చీకటిగా ఉండి వచ్చి వెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు వెంటనే బస్టాండ్ ఆవరణలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే.నాగూల్ మీరా అన్నారు. ఆవరణలో సీసీ కెమెరాలు లేకపోవడం అలాగే రాత్రి వేళల్లో ఫ్లడ్ లైట్లు వెలకపోవటం వలన దొంగతనాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎప్పటినుంచో కొనసాగుతున్న గంగావతి బస్సు సర్వీసును తొలగించకుండా యధావిధిగా గంగావతి సర్వీసులు నడిపాలని కోరారు. సీపీఐ తిరువూరు పట్టణ కార్యదర్శి ఉదయ్ మాట్లాడుతూ...బస్టాండ్ ఎదురుగా ఉన్నటువంటి కాళీ కాంప్లెక్స్ లో చీకటిబడితే అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. తిరువూరు ఆర్టీసీ డిపో వారు తక్షణమే బస్టాండ్ ఆవరణలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని,ఆర్టీసీ డిపో మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎస్కే మీరా కార్పెంటర్, సహాయ కార్యదర్శి ఎస్కే సుభాని, ఎస్కే మస్తాన్, బాణాల అశోక్, పాలకుర్తి సునీల్, బత్తుల వెంకటేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : నిరుపేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేశారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు.జగ్గయ్యపేట పట్టణం,బాలుర హై స్కూల్ నందు 12,13,14 సచివాలయాలకు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం సభ్యులు ఉదయభాను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యంగా ఆనందంగా జీవించడానికి మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. అందుకనే ఆరోగ్యశ్రీలో కూడా గతంలో కంటే ఎక్కువ వ్యాధులకు చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు.రాష్ట్రంలో 17 వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష ద్వారా స్పెషలిస్ట్ వైద్యులు గ్రామాలకే తరలివచ్చి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందివ్వడం జరుగుతుందన్నారు. ఐదు దశలుగా జరిగే ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్,హఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, కౌన్సిలర్లు పందుల రోశయ్య,పాకలపాటి సుందరమ్మ, తన్నీరు నాగేంద్ర,పట్టణ మహిళా సమైక్య అధ్యక్షురాలు షేక్ మునిహేరా,విద్యావేత్తల చైర్మన్ రంగాపురం నరసింహారావు,నాయకులు గింజుపల్లి కృష్ణ,జంగాల వాసు,దొంగల జనకి రమయ్య,మోరే బాబి,యేసుపోగు కృపారావు, మారేపల్లి నాగేంద్ర,డి సి హెచ్ నాయక్,డాక్టర్స్ షైలా,సీతారాం,రాజ్ కుమార్, హెచ్‌ఎం మాధవి లత, తదితరులు పాల్గొన్నారు.

1476 మందికి పీఎంఏ రుణాలు

విశాలాంధ్ర-విజయవాడ : నగరపాలకసంస్థ మూడు సర్కిల్స్ పరిధిలోని వీధి విక్రయదారులకు ప్రధానమంత్రి ఆత్మవేత్తల నిధి కింద రుణాలు మంజూరుకు క్రెడిట్ క్యాంపులు నిర్వహించారు. ఈనెల 7వ తేదీన విద్యాధరపురంలో 117 సచివాలయం వద్ద నిర్వహించిన క్యాంపులో 455 మందికి, 9న ఐవీ ప్యాలెస్‌లో జరిగిన క్రెడిట్ క్యాంపులో 545 మందికి, 11న కృష్ణలంక రాణిగారితోటలోని శాంపిల్ బిల్డింగ్ వద్ద జరిగిన క్రెడిట్ క్యాంపులో 476 మందికి రుణాలు మంజూరు చేయడం జరిగిందని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల తెలిపారు. ఈ కార్యక్రమంకు సంబంధించిన పీఎంఎస్‌వీ కాంపెయిన్ ఎస్‌బీఐ బ్యాంక్ ప్రతినిదులతో సంప్రదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి సర్కిల్-3 ఇంచార్జి సీడీవో రమ్య, టెక్నికల్ ఎక్సుర్ట్ శేఖర్, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

-డీపీఓ జయచంద్రగాంధీ

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : రెడ్డిగూడెంలో జిల్లా పంచాయతీ అధికారి జయచంద్రగాంధీ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. మండలంలోని గ్రామపంచాయతీ పరిధిలలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించి పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.,ఈ కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారి బి. శ్రీనివాస్, విస్తరణ అదికారి బి. శ్రీనివాసరావు, రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణీ, పంచాయతీ కార్యదర్శి డా. రవికుమార్, గ్రీన్ అంబాసిడర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలంలో మంగళవారం విద్యుత్ శాఖ ఆకస్మిక విద్యుత్ తనిఖీలు నిర్వహించడం జరిగింది మొత్తం 39 బృందాలుగా ఏర్పడి 3023 సర్వీసులు కంచికచర్ల మండలంలో తనిఖీ చేయగా అధికంగా లోడువాడే 282 మందిపై అధిక లోడు కేసులు నమోదు చేయడం జరిగింది. వీరి కింద అపరాధ రుసుముగా ఆరు లక్షల ఇరవై తొమ్మిది వేల రూపాయలు జరిమానా విధించడం జరిగింది. విద్యుత్ సౌర్యం చేసిన వారిపై సామాజిక నేరము విద్యుత్ చేసిన వారిపై అపరాధ రుసుముతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం కలదు కావున విద్యుత్ వినియోగ దారులంద రూ గమనించగలరు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ సూపరింటెంట్ ఇంజనీర్ ఎం ఆల్ ఫోన్స్ పర్యవేక్షణలో జరిగింది విజిలెన్స్ ఈ ఈ కమల కుమారి ఏడి విజిలెన్స్ నవీన్ కుమార్ తో పాటు విజయవాడ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జిబి శ్రీనివాస రావు ఇబ్రహీంపట్నం ఏ డి ఈ కొండల రావు విద్యుత్ రెవెన్యూ అధికారి నాయుడు నరసింహారావు కంచికచర్ల విద్యుత్ శాఖ ఏఈ వైవి కృష్ణారావు జగ్గయ్యపేట నందిగామ మైలవరం నియోజకవర్గ ఏడీలు ఏఈలు పాల్గొన్నారు తనిఖీల అనంతరం జరిగినటువంటి సమీక్ష సమావేశంలో విద్యుత్ సిబ్బంది యాక్సిడెంట్లు నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించడం జరిగింది.

కళాకారుల గుర్తింపు కార్డులకు దరఖాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో వివిధ కళా రూపాల్లో సేవలందిస్తున్న కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే గుర్తింపు కార్డులకు ఈ నెల 12వ తేదిలోపు ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు గుర్తింపు కార్డులకు ధరఖాస్తు చేసుకున్న సుమారు150 మందిపైగా కళాకారులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేయడం జరిగిందని గుర్తింపు కార్డులు పొందని కళాకారులు ఈనెల 12వ తేది సాయంత్రంలోపు విజయవాడ గోపాలరెడ్డి రోడ్డులోని స్టేట్‌గెస్ట్ హౌస్‌లో గల యు.సురేంద్రనాథ్ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సమాచార పౌర సంబంధాల శాఖ ఎన్‌టీఆర్ జిల్లా వారి కార్యాలయంలో గుర్తింపు కార్డుల ధరఖాస్తులను సమర్పించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులపై దాడి-ఒకరికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): కాలేజీ విద్యార్థుల పై దాడి జరిగింది.ఈ ఘటన మంగళవారం విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ దాడిలో ఓ విద్యార్థికి తీవ్రగాయాలైయ్యాయి. మొఘల్‌రాజ్‌పురంలోని ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థిని మున్సిపాల్ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. దీంతో బాధితుడు తన స్నేహితులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో స్నేహితులంతా కలిసి గొడవ జరుగుతన్న ప్రదేశానికి చేరుకున్నారు. రెండు వర్గాల యువత ఘర్షణకు దిగ్గారు. ఓ విద్యార్థి పై గాజు సీసాతో దాడి చేశారు. తీవ్రగాయాలైన విద్యార్థిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మాచవరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు.

కృష్ణలంకలో సెల్ చోరీ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ కృష్ణలంకలో సెల్‌ఫోన్ స్నాచింగ్ జరిగింది. గొల్లపూడికి చెందిన రూబెన్ అతని స్నేహితుడు ఈనెల 9వతేదీన అర్ధరాత్రి ఫుడ్‌కోర్ట్‌లో టిఫిన్ చేసి కృష్ణలంక కట్ట నుంచి గొల్లపూడి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని ఐదుగురు యువకులు అడ్డగించారు. వారిని బెదిరించి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి పరారైయ్యారు. బాధితుడు కృష్ణలంక పోలీసులను ఆశ్రయించాడు.

ప్రతి ఒక్కరికి ఇంటివద్దకే వైద్యం

విశాలాంధ్ర- నందిగామ: మండలంలోని పెద్దవరం, వెలది కొత్తపాలెం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో జగనన్న పాలన ఒక సువర్ణ అధ్యాయం పేదలకు ఇంత మంచి చేసిన ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదు ప్రతి ఒక్కరికి మంచి చేయాలనే దృక్పథం తోనే జగనన్న పనిచేస్తున్నారు.ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలన్నదే జగనన్న లక్ష్యం స్పెషలిస్ట్ డాక్టర్లు గ్రామాలకు రావడంతో ప్రజల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు మంచి స్పందన వస్తుంది ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా అవసరమైన మందులు అందజేయడం రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం పుట్టిందన్నారు. పల్లె గూటికి స్పెషలిస్ట్ వైద్య సేవలు రావడం ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ఉచితంగా వైద్య సేవలు అందిచడం ఎంతో ప్రయోజనకరముంటున్న పల్లె ప్రజలు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేర్ సెంటర్‌లో వరల్డ్ మెంటల్ హెల్త్ డే

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ, నెహ్రూ నగర్, భవిత కేర్ సెంటర్‌లో వరల్డ్ మెంటల్ హెల్త్ డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరై కేర్‌సెంటర్‌లోని చిన్నారుల గురించి తెలుసుకొని చిన్నారులకు బిస్కెట్, క్రేయన్స్ అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నందిగామ బార్ ఉపాధ్యక్షులు బొబ్బిల్లపాటి భాస్కర్‌రావు, ఏపీపీ ఈశ్వరప్రగాఢ రంగా రావు, ఏ జి పి మట్టా ప్రసాద్,న్యాయవాది కొమ్మినేని మౌలేశ్వర రావు, ఈశ్వరప్రగాఢ శేషగిరిరావు, మరియు కేర్ సెంటర్ నిర్వాహకులు రిసోర్స్ పర్సన్ కే వి వి ఎస్ మల్లేశ్వర రావు, శారదా, వలంటీర్ అనూష పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేదే లేదు

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే సీఎం జగన్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులతో రాజకీయ కక్ష సాధిస్తున్నారని తెలిపారు.స్కిల్ డెవలప్మెంట్, ఇన్నర్ రింగ్ రోడ్, ఫైబర్ గ్రిడ్ అంటూ ఒకదాని తర్వాత ఒకటి కేసులు పెడుతున్నారని,టిడిపి హయాంలో 6 లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ సీఎం జగన్ సహా వైసిపి నేతలంతా నోరు నెత్తి బాదుకున్నారు కానీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయిన 60 రూపాయలు అవినీతి కూడా నిరూపించలేకపోయారని విమర్శించారు.టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేశారు కానీ జగన్ రాజకీయ కక్షతో దాన్ని నిర్వీర్యం చేసి యువతకు ఉపాధి లేకుండా చేశారని పేర్కొన్నారు. వ్యవస్థలని మేనేజ్ చేసి చంద్రబాబు నాయుడుకి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో నేరస్తులు బయట తిరుగుతున్నారని, నిరపరాదులు చెరసాలలో ఉంటున్నారని, అరాచక పాలనకు కాలం చెల్లిందని ఏద్దేవా చేసారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగుతున్న ఆందోళనలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ విస్సన్నపేటలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు శుక్రవారం కూడా కొనసాగాయి. మండలంలోని తాతకుంట్ల గ్రామంలో తొలుత మండలపార్టీ నేతలు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని, నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న నిరాహారదీక్షా శిబిరం వద్దకు చేరుకుని ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలు, ప్రజలపై కేసుల రూపంలో కొనసాగిస్తున్న దమనకాండను నిరసించారు. కార్యక్రమంలో మండల నాయకులు మట్టా వేణుగోపాలరావు, నెక్కళపు శ్రీనివాసరావు, నెక్కళపు వెంకటేశ్వరరావు, దమ్మాలపాటి సాంబశివరావు, మురళి, కోలేటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మిరెడ్డిగూడెంలో ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-గంపలగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని గంపలగూడెం మండలం ఎంపీడీవో ఎర్రమల పిచ్చిరెడ్డి, తహసిల్దార్ జిట్టా బాలకృష్ణారెడ్డి లు అన్నారు. మంగళవారం నాడు అమ్మిరెడ్డి గూడెం గ్రామంలోని ఏబీఎస్ ఉన్నత పాఠశాల వద్ద తిరువూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వైద్య ఉప కేంద్రాల వైద్యాధికారుల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించబడింది. ఈ ఆరోగ్య సురక్ష సదస్సు కార్యక్రమంలో731 మంది రోగులకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మానసిక సమస్యలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మానసిక సమస్యల పట్ల అవగాహన లేకపోవడం వలన ఆత్మహత్యలు, హింస, గొడవలు, ప్రొడక్టవిటీని కోల్పోవటం, సమాజంలో చులకన చెయ్యబడటం మొదలైన ఇబ్బందులు కనిపిస్తున్నాయని వాటిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అయోధ్య ఆర్ కె పేర్కొన్నారు.ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు సందర్భంగా మంగళవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిసంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేన్నయినా సాధించగలుగుతాడు.ఆరోగ్యమంటే కేవలం శారీరకంగానే కాదు, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి అన్నారు. మానసికంగా ఆరోగ్యంగా ఉంటే శారీరక సమస్యలు కూడా తగ్గుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణంకాల ప్రకారం ప్రతి ఎనిమిది మందిలో ఒకరు మానసిక రుగత్మలతో బాధపడుతున్నారు. వీరిలో చాలా మంది మానసిక వైద్యం చేయించుకోవటం లేదని నిపుణులు తెలుపుతున్నారు. వీటిని తగ్గించేందుకు ఖచ్చితంగా యోగా, ధ్యానం చేయాలని,అలానే బాధితులు భయపడకుండా వైద్యులను సంప్రదించాలని డాక్టర్ అయోధ్య సూచించారు.డాక్టర్ మానస కాజు మాట్లాడుతూ ఇప్పటికి మన సమాజములో మానసిక సమస్యలు, వ్యాధులు గుర్తుపట్టటమే కానీ, మానసిక వ్యాధి వుంది అని మనస్సు ఒప్పుకోవటానికి చాలా మంది ఇబ్బందిపడుతున్నారు. డబ్ల్యు, హెచ్.ఓ. ప్రకారం ఆరోగ్యం అంటే భౌతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా,సామాజికంగా బాగున్నప్పుడే పరిపూర్ణ ఆరోగ్యం అని నిర్వచనం. ఈ సంవత్సరం డబ్ల్యు.ఎం. హెచ్.ఎఫ్.నినాదం అందరికి మానసిక ఆరోగ్యం-ప్రపంచ ప్రాధాన్యతగా చేద్దాం అన్నారు.

CHANGE OF NAME

I, **BUDDI RAGHUNATH CHOWDARY** (Old Name), S/o. Prasad Rao Buddi Resident of D.No:11-113/1, Buddi Vari Veedhi, Kanchikacherla, NTR District, A.P. Have changed my name to **BUDDI RAGHUNADH CHOWDARY** (New Name), S/o. Prasad Rao Buddi. Hence forth, I will be called & Known as **BUDDI RAGHUNADH CHOWDARY.**

కోడూరు-అవనిగడ్డ రహదారి నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : కోడూరు-అవనిగడ్డ రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ భారతీయ జనతాపార్టీ సీనియర్ నేత పరిమిశెట్టి ప్రభాకర్ మంగళవారం దీక్ష చేపట్టారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లో ప్రభాకర్ ఆమరణ నిరాహారదీక్ష చెపట్టగా భారతీయ జనతాపార్టీ ఎస్.సి మోర్చ జిల్లా అధ్యక్షులు చాట్రగడ్డ రాజశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు భూపతి సుబ్రహ్మణ్యంలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. గడిచిన మూడు సంవత్సరాలుగా అధికార పార్టీ నేతలు ఎంతో మంది హామీలు ఇచ్చినప్పటికి అమలు కానీ హామీగానే మిగిలిపోయిందని గత సంవత్సరం అక్టోబర్ 20 వ తేదిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవనిగడ్డలో జరిగిన బహిరంగ సభలో అవనిగడ్డ - కోడూరు రహదారి నిర్మాణానికి 35 కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు వేలాది మంది ప్రజల సమక్షంలో చెప్పినప్పటికి నేటికి కూడా ఎటువంటి పనులు చేపట్టకపోవడం వల్ల రెండు మండలాల ప్రజలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన హంసలదీవి సాగరసంగమంకు వచ్చే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. తక్షణమే అవనిగడ్డ - కోడూరు రహదారి నిర్మించాలని కోరారు. భారతీయ జనతా పార్టీ కృష్ణాజిల్లా ఎస్.సి మోర్చ అధ్యక్షులు పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాట్రగడ్డ రాజశేఖర్ మాట్లాడుతూ అవనిగడ్డ- కోడూరు రహదారిపై వేలాదిమంది ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కోంటుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా భాధాకరం అని రోడ్డు ప్రమాధాలు ఈ ప్రాంతంలో ఎక్కువగా జరుగుతున్నాయని ఈ రహదారితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రహదారులన్నీ గుంటలతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారన్నారు.

గాయపడిన పశువుకు చికిత్సలు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక ఏలూరు రోడ్డులోని ముబారక్ సెంటర్‌లో రొడ్లపై ఉండే పశువును గుర్తు తెలియాని వాహనం ఢీ కోనడంతో కలు విరిగి తీవ్ర రక్తస్రావంతో రక్తపు మడుగులో ఉన్న పశువును జనసేన నాయకుడు డా॥ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అధ్వర్యంలో పశువైద్యులచే శాస్త్రచికిత్స చేసి రక్షించడం పట్ల పలువరు ఆర్‌కె కోనయాడారు. మంగళవారం రక్తమడుగులో ఉన్న పశువుకు వైద్యులచే జనసేన నాయకుడు ఆర్‌కె వైద్యం చేయించడం గొప్ప విషయమాని పలువురు అభినందించారు. ఈ సందర్బంగా ఆర్‌కె మాట్లాడుతూ నోరులేని మూగజీవాలను రోడ్లమీద వదిలివేయడంతో వాటికి ఎన్నో ప్రమాదలు సంబవిస్తునయన్నారు. పశువులు రోడ్లు మీద సేద తీరడంతో ప్రజలకు, వాహనదారులకు కూడా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. పశువుల యాజమానులకు మున్సిపల్, పోలీసుశాఖలు చర్యలు తీసుకోవలన్నారు. పశువైద్య అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నూనె అయ్యప్ప, కిరణ్, శివ, చరణ్, తేజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోని టాప్ పరిశోధకుల్లో ఎల్‌వీపీఈఐ శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర విజయవాడ లక్ష్మీపేట : స్టాన్ఫర్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఒక అధ్యయనంలో ప్రపంచంలోని 2 శాతంఅగ్రశ్రేణి పరిశోధకులలో ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ) లోని ప్రముఖ శాస్త్రవేత్తలు పన్నెండుమంది పేర్కొనబడ్డా రని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అద్భుతమైన విజయం అగ్రశ్రేణి పరిశోధకుల జాబితాలో వరుసగా నాలుగవ సంవత్సరం కూడ ఉండటం గమనార్హమన్నారు. సంస్థ పరిశోధనా కార్యకలాపాలు కేవలం వైద్య అధ్యయనాలకు పరిమితం కాకుండా, ప్రజారోగ్యం, మౌలిక విజ్ఞానం, దృష్టి పరిశోధన మరియు స్టెమ్ సెల్స్, జన్యు సవరణ, మరియు 3డి టిష్యూ ముద్రణతో కూడిన అత్యాధునిక అనువాద అధ్యయనాలకు విస్తరించాయని ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన పరిశోధానాది పతి డాక్టర్ సయన్ బసు అన్నారు.ముఖ్యంగా ఎల్విపిఇని ప్రముఖ శాస్త్రవేత్తలు ఏడుగురు వారి జీవితకాల అనులేఖనాల ఆధారంగా ఈ విశిష్టతకు అర్హులయ్యారన్నారు.

ఐసిఐసిఐ బ్యాంక్ ఫెస్టివ్ బొనాంజా ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పండుగ సీజన్ ప్రారంభంతో తమ కస్టమర్‌లకు అద్భుతమైన ఆఫర్‌లు, డిస్కౌంట్‌లు, రూ. 26,000 వరకు క్యాష్‌బ్యాక్‌లతో ఫెస్టివ్ బొనాంజాను ప్రారంభించినట్లు ఐసిఐసిఐ బ్యాంక్ ప్రకటించింది. ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డ్‌లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐని రూపే క్రెడిట్ కార్డ్‌లు ద్వారా ఉపయోగించడం, కార్డ్‌లెస్ ఈఎంఐ ద్వారా కస్టమర్‌లు తమకు ఇష్టమైన బ్రాండ్‌ల నుండి వివిధ వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా ఈ ప్రయోజనాలను పొందవచ్చు. ఈ ఆఫర్‌లు బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డ్‌లను ఉపయోగించిన ఎడల నో-కాస్ట్ ఈఎంఐల రూపంలో కూడా కస్టమర్‌లకు అందుబాటులో ఉంటాయి.

పిల్లల కోసం హిమాలయ టూత్‌పేస్ట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు ప్రముఖ వెల్‌నెస్ బ్రాండ్ హిమాలయ వెల్‌నెస్ కంపెనీ హిమాలయ కిడ్స్ టూత్‌పేస్ట్‌ను ప్రవేశపెడుతూ పిల్లల టూత్‌పేస్ట్ మార్కెట్‌లోకి అడుగుపెడుతున్నట్టు ప్రకటించింది. పిల్లల ఇష్టాలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ టూత్‌పేస్ట్ ఆరెంజ్, కూల్ మింట్, బబుల్ గమ్ వంటి మూడు ఉత్తేజకరమైన రుచుల్లో లభిస్తుంది. వ్యక్తిగత సంరక్షణ మార్కెట్‌లో బలమైన ఉనికి కలిగిన ఈ కంపెనీ ఇప్పుడు ఈ సరికొత్త టూత్‌పేస్ట్ ద్వారా సహజ సంరక్షణతో కూడిన సున్నితమైన, ప్రభావవంతమైన, సురక్షితమైన దంత సంరక్షణను పిల్లలకు అందిస్తామని తల్లిదండ్రులకు హామీ ఇస్తోంది.

ఉచిత సేవా శిబిరాన్ని ప్రారంభించిన బీఎస్హెచ్ హోమ్ అప్లయెన్సెస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని బీఎస్హెచ్ హెూమ్ అప్లయెన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ గృహెూపకరణాల పరిశ్రమలో గ్లోబల్ లీడర్ అయిన బోష్, సిమెన్స్ ఉపకరణాల కోసం అక్టోబర్ 9 నుండి 14వ తేదీ వరకు భారతదేశంలోని పలు మార్కెట్‌లలో ఉచిత సేవా శిబిరాన్ని నిర్వహించడానికి సిద్ధమైంది. ఈ శిబిరంలో, పొడిగించిన వారంటీపై ప్రత్యేక తగ్గింపు, విడి భాగాలు, ఉపకరణాలు, వినియోగ వస్తువులపై ప్రత్యేక తగ్గింపు, బోష్, సిమెన్స్ ఉపకరణాల సందర్శన, లేబర్ ఛార్జీలపై పూర్తి మినహాయింపు వంటి ప్రయోజనాలను కస్టమర్‌లు పొందుతారు. డిస్కేలర్లు, డిటర్జెంట్లు, డిష్‌వాషర్ టాబ్లెట్‌లు, డస్ట్ కవర్లు, పీడెస్టల్స్, మరిన్నింటితో సహా విభిన్న శ్రేణి వినియోగ వస్తువులు, ఉపకరణాలను బీఎస్హెచ్ కస్టమర్ సేవ అందిస్తుంది.

మిరప పంటలలో తామర పురుగుల దాడిని తిప్పికొట్టే ఉత్పత్తులను ఉపయోగించండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): గత సంవత్సరం భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాలలో 50-80 శాతం మిరప పంటలను ప్రభావితం చేసినది తామర పురుగు (త్రిప్స్). రసం పీల్చే కీటకాల్లో అతి ముఖ్యమైన గ్రూప్ లలో ఈ త్రిప్స్ ఒకటి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలోని మిర్చి రైతులకు సంభావ్య ముప్పుగా ఇది కొనసాగుతోంది. ప్రపంచ మిర్చి ఉత్పత్తిలో భారతదేశం దాదాపు 36 శాతం వాటాను కలిగి ఉన్నందున, త్రిప్ పై సమర్థవంతంగా పనిచేసే ఉత్పత్తులను వాడడం ద్వారా పంటను తెగుళ్లు, కీటకాల నుండి రక్షించడం చాలా ముఖ్యం. “ఈ త్రిప్‌లు ప్రధానంగా ఆకుల దిగువ భాగం, పువ్వుల వంటి పునరుత్పత్తి భాగాలు వద్ద ఎక్కువగా కనిపిస్తుంటాయి. మిర్చి పంటను అన్ని రకాల నేలల్లో, వివిధ వాతావరణ పరిస్థితులలో సాగు చేస్తున్నందున, రైతులు తమ పంటల సమర్థవంతమైన నిర్వహణ కోసం పంటకు సంబంధించి వివిధ దశలో త్రిప్స్ యొక్క సంభవం, వాటి సంఖ్యను పర్యవేక్షించడం తప్పనిసరి” అని గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సిఇఒ రాజవేలు ఎన్‌కె అన్నారు.

150వ స్టోర్‌ను ప్రారంభించిన కోస్టా కాఫీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కోస్టా కాఫీ, భారతదేశంలోని వాణిజ్య పానీయాల వర్గాలలో కోకా-కోలా యొక్క ప్రముఖ కాఫీ బ్రాండ్, భారతదేశంలో తన 150వ స్టోర్‌ను న్యూఢిల్లీలోని రాజౌరీ గార్డెన్‌లో ప్రారంభించింది. కోస్టా కాఫీ 2005లో భారత మార్కెట్‌లోకి ప్రవేశించి, న్యూఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తన ప్రారంభ కేఫ్‌ను ప్రారంభించింది. గత సంవత్సరం, దేవయాని ఇంటర్నేషనల్ సహకారంతో, కోస్టా కాఫీ భారతదేశంలో గణనీయమైన విస్తరణ ప్రయాణాన్ని ప్రారంభించి, సుమారు 60 స్టోర్లను జోడించింది. విమానాశ్రయాలు, హైవేలు, ఆరోగ్య సంరక్షణలో ప్రత్యేక ఛానెల్‌లను ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యతనిస్తుంది.

ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తున్న అమెజాన్ ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అమెజాన్ ఇండియా భారతీయుల పండగ సీజన్ కోసం తన కార్యకలాపాల నెట్‌వర్క్‌లో 100,000 కన్నా ఎక్కువ సీజనల్ ఉద్యోగ అవకాశాలను సృష్టించామని ప్రకటించింది. దీనితో భారతదేశం వ్యాప్తంగా ముంబయి, ఢిల్లీ, పుణె, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా, లక్నో మరియు చెన్నై వంటి నగరాల్లో ప్రత్యక్ష మరియు పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయి. అక్టోబరు 8, 2023న ప్రారంభమయ్యే అమెజాన్ ‘గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్'కి ముందస్తుగా, ప్రైమ్ వినియోగదారులకు అక్టోబరు 7న ప్రారంభ యాక్సెస్ ఉంటుంది. అమెజాన్ ఇండియా ఇప్పటికే ఈ కొత్త ఉద్యోగులను ఇప్పటికే తన నెట్‌వర్క్‌లోకి చేర్చుకుంది.

గ్రామ స్వరాజ్య స్థాపనే జగనన్న ధ్యేయం : సామినేని

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మహాత్మా గాంధీ కలలు కన్నా గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం, పెనుగంచిప్రోలు సచివాలయం -2 హరిజనవాడ,బోస్ పేట ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వవిప్,జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల స్థాపన ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు స్థానిక పాలన అందిస్తూ, ప్రభుత్వ సేవలన్నింటినీ ఇంటి ముంగిటకే తెచ్చారుఅనిఅన్నారు.నాడు-నేడు,వసతి విద్యా దీవెన పథకాలతో అట్టడుగు వర్గాలకు ఉన్నత విద్య అందుతోంది అని తెలిపారు.మహనీయులు ఆశించిన మేరకు పాలన సాగుతోంది అని అన్నారు.ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకే తీసుకెళ్లేందుకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు,వైఎస్సార్ గ్రామీణ వైద్య శాలలు,డిజిటల్ లైబ్రరీ, పాల సేకరణ కేంద్రాలకు నాంది పలికింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, ఎంపీపీ మార్కపుడి గాంధీ,జేడ్పీటిసి పూట్ల నాగమణి,మైనింగ్ పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు,చేని కుమారి,గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్,మాజీ మండల పార్టీ అధ్యక్షులు పూట్ల నాగేశ్వరరావు,మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరరావు ,మండల సచివాలయాల కన్వీనర్ కన్నమల శామ్యూల్,వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు,మండల సమైక్య అధ్యక్షురాలు కాకాని పద్మ,సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు,నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ నారెండ్ల కిశోర్,తదితర ముఖ్య నాయకులు అధికారులు,సచివాలయ సిబ్బంది వాలంటీర్స్ పాల్గొన్నారు.

పైతాన్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో గతవారం రోజులుగా కంప్యూటర్ విజన్ అండ్ ఐ ఓ టి విత్ పైతాన్ ప్రోగ్రామింగ్ అను అంశంపై కొనసాగుతున్న కార్యశాల మంగళవారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. వంశీ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇమేజ్ ప్రాసెసింగ్, ఫేస్ రికగ్నిషన్, ఐరిష్ డిటెక్షన్ తదితర అంశాలలో పైతాన్ ప్రోగ్రామింగ్ ఎలా వాడాలో విద్యార్థులకు ఎస్ హెచ్ అండ్ ఐ సొల్యూషన్స్ డైరెక్టర్ ఎస్. ప్రదీప్ కుమార్ శిక్షణ అందించారు. నోడ్ ఎంసీయూ, రాస్ప్ బెర్రీ పి పరికరాల పై హాండ్స్ ఆన్ అప్లికేషన్స్ పై విద్యార్థుల కు అవగాహన కల్పించారు. ఇటువంటి శిక్షణల ద్వారా ఐవోటి టెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు అందిపుచ్చు కోవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ వంశీ కిరణ్ తెలిపారు. విద్యార్థులు అధునాతన సాంకేతిక రంగాలలో జరుగుతున్న మార్పులను తెలుసు కుంటూ వాటిలో ఎప్పటికప్పుడు పట్టు సాధిస్తే విజయం తథ్యమని సూచించారు. కార్యశాల ముగింపు కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండు రంగారావు, మేనేజ్మెంట్ మెంబర్ ఎం. సుహాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ. వంశీ కిరణ్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. పుల్లారావు, కోఆర్డినేటర్ కె. వీణానంద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కనకదుర్గ దేవాలయ రహదారి అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట ద్వారకానగర్‌లోని కనకదుర్గ దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని పలువురు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. మండలకేంద్రమైన విస్సన్నపేట సహా, పలు గ్రామాల ప్రజలు రానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలకు హాజరు కానున్నారు. ఈ క్రమంలో రహదారి పూర్తిగా ధ్వంసమై, పారిశుధ్య పరిస్థితులు లోపించే ఆందోళన కర పరిస్థితులు ఉన్న విషయమై ఫిర్యాదులు రావటంతో ఎంపిపి పి.మెర్సీ వనజాక్షి, సర్పంచి ఎస్.నాగమల్లేశ్వరి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు ఈ రహదారిని పరిశీలించారు. అనంతరం రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మానసిక ఆరోగ్యమే సంతోష జీవితానికి తొలిమెట్టు

విశాలాంధ్ర-విజయవాడ : సంతోష జీవితానికి తొలిమెట్టు మానసిక ఆరోగ్యమేనని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని, విజయవాడ సింగ్ నగర్ లోని వివేకానంద ఉన్నత పాఠశాలలో, పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కొరకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలు దీర్ఘకాలిక శారీరక సమస్యలకు మానసిక స్థితి పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ యస్ కె నజ్మా , యస్ జాకబ్ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళగిరికి ఢిల్లీ-మహారాష్ట్ర జట్లు

విశాలాంధ్ర-మంగళగిరి : క్రికెట్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు మంగళగిరి, మూలపాడు లోని క్రికెట్ స్టేడియంలలో బీసీసీఐ అండర్-19 పురుషుల అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీ నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగానే మంగళవారం ఢిల్లీ, మహారాష్ట్ర జట్లు మంగళగిరి స్టేడియంకు చేరుకున్నాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన జట్ల కెప్టెన్లు ఆర్.వఘెలా, కిరణ్ కార్మెల్, చీఫ్ కోచ్‌లు జస్వంత్ రాయ్, అజయ్ చవాన్ పర్యవేక్షణలో మంగళగిరి స్టేడియంలో ప్రాక్టీస్ ముమ్మరంగా నిర్వహించారు. అదేవిధంగా హైదరాబాద్, ఉత్తరాఖండ్, మేఘాలయ, బెంగాల్ రాష్టాలకు చెందిన జట్లు మూలపాడులోని స్టేడియంలో ప్రాక్టీస్ చేశారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్థానిక స్వరాజ్ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ స్మృతి వనం నిర్మాణ పనులను నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం పరిశీలించారు. స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ విగ్రహం కారిడార్ చుట్టూ నిర్మాణం జరుగుతున్న ప్రహరి గోడ పనులు, లైటింగ్, గ్రానైట్, పాత్వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ తదితర పనులను పరిశీలించారు. మ్యూజియం, థియేటర్ సందర్శించి అక్కడ సీలింగ్, ఎలక్ట్రిసిటీ పనులు, పెయింటింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించాలని క్వాలిటి కంట్రోల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఎపీ ఐజిసీ అధికారులు, కేపీసీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహంలో అవగాహనా సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా స్థానిక 36వ డివిజన్ హనుమాన్‌పేటలోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ, ఎన్జీవో ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర పాలక సంస్థ అడిషినల్ కమిషనర్, యూసీడీ పీవో కే.శకుంతల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి మెప్మా, వీఎంసీ ఆధ్వర్యంలో నాలుగు నిరాశ్రయుల వసతి గృహాలను నిర్వహిస్తున్నామని, నిరుపేదలు వివిధ రకాల కారణాలతో, వివిధ పనులతో, నగరానికి వచ్చినపుడు వసతి గృహాలను వినియోగించుకోవచ్చన్నారు. ఆయా గృహాల్లో త్రాగునీరు, పారిశుద్ధ్యం, వసతి, మరుగుదొడ్లు వంటి కనీస అవసరాలను పొందవచ్చని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు మరింత అంకిత భావంతో పని చేయాలని, నైట్ డ్రైవ్స్ నిర్వహించి, ఎక్కువ మంది ఈ వసతి గృహాలను వినియోగించుకునేల చూడాలని సూచించారు. వసతి కొరకు బస చేసేవారు క్రమశిక్షణ కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ రామకృష్ణ, సర్కిల్-3 సీడీవో జగదీశ్వరి, మెప్మా కో ఆర్డినేటర్ మహాలక్షి, సోషల్ వర్కర్ నాగరాజు, రూట్స్ హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకులు, కేర్ టేకర్స్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక సర్వీసు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 12 వ తేది గురువారం సాయంత్రం 5 గంటలకు 9 ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తులు, ప్రజల కోరిక మేరకు సూపర్ లగ్జరీ స్పెషల్ సర్వీసు బయలుదేరుతున్నట్లు చెప్పారు. మంగళవారం డి.పో మేనేజర్ తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రాలైన బ్రహ్మం గారి మటం, మహానంది, అహోబిళం, యాగంటి, అలంపూర్ (జోగులంబ దేవాలయం) మంత్రాలయం (శ్రీ రాఘవేంద్ర స్వామి దేవాలయ మటం) శ్రీశైలం, త్రిపురాంతకం, కోటప్ప కొండ, త్రి కోటేశ్వర స్వామి దేవాలయం మొదలైన దేవాలయాలను దర్శించుకుని వచ్చేటట్లుగా నాలుగు రోజుల పాటు టూర్‌తో ఈ సర్వీసు నడపబడుతున్నట్లు చెప్పారు. ఈ సర్వీసు ఒకొక్కరికి బస్సు చార్జీ 3 వేల రూపాయలు. ముందస్తు రిజర్వేషన్ చేసుకునేందుకు ఆన్‌లైన్ నందు కానీ, ఎటిబి ఏజెంట్లు, రిజర్వేషన్ కౌంటర్ వద్ద సదుపాయం కలదన్నారు. సీట్లు పరిమితంగా ఉన్నాయని, వెంటనే రిజర్వేషన్ చేయించుకోవాలని, ఈ సర్వీసు అవనిగడ్డ నుండి రేపల్లె, బాపట్ల, ఓంగోలు, బెస్తావారి పేట, బ్రహ్మంగారి మటం వెళ్ళి మిగిలిన పుణ్యక్షేత్రాలను దర్శించుకుని వచ్చే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని మరిన్ని వివరాలకు 9674859427 గానీ, 7382925700 గానీ సంప్రదించాలన్నారు.

చంద్రబాబు సహకరిస్తే నిజాలు బయటకు వస్తాయి

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ నేతలు ప్రతి చిన్న విషయాన్ని రాద్ధాంతం చేస్తూ సానుభూతి పొందాలని చూస్తున్నారని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. మంగళగిరి పట్టణంలోని ఏపీ ఎస్పీ 6వ బెటాలియన్‌లో జరిగిన 21వ బ్యాచ్ కెనైన్(పోలీస్ జాగిలం), హ్యాండలర్స్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సీఐడీ అధికారులకు సహకరిస్తే నిజాలు తప్పకుండా బయటకు వస్తాయన్నారు. చంద్రబాబు అవి నీతి ఆరోపణల్లో గ్రావిటీ ఉంది కాబట్టే బెయిల్ రావడం లేదని అన్నారు. చంద్రబాబు అవినీతి చేయలేదనే మాట ఎక్కడా టీడీపీ నేతల నోటి నుంచి రావడం లేదన్నారు. మంత్రి రోజాపై విమర్శలు సరికాదన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఎటువంటి ఎజెండా లేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎవరు ఎంత మందితో కలిసి వచ్చినా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు.

శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో పూజలు

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ అధినేత నారా చంద్ర బాబునాయుడిపై మోపిన నిందలు తొలగి నిర్దోషిగా బయటకు రావాలని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహా స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ కార్యదర్శి నల్లగొండ పరమేశ్వరరావు గుడి చుట్టూ మోకాళ్ళపై ప్రదక్షిణలు చేశారు. చంద్రబాబు త్వరగా విడుదలవ్వాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అవినీతి ఇంటింటికి తీసుకెళ్తాం

విశాలాంధ్ర-మంగళగిరి : దుర్మార్గపు వైసీపీ పాలనను అంతముదించేందుకు గ్రామ గ్రామా నికి వెళ్లి ప్రజా వ్యతిరేక విధానాన్ని వివరించి ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్ అక్రమం అని, స్కిల్ స్కీమ్ ఏమి జరిగింది. దాంట్లో ఎంతమంది శిక్షణపొంది ఉద్యోగాలు పొందారనేది ప్రతి ఇంటికి వెళ్లి వివరిస్తామన్నారు. అవినీతి అక్రమాలకు కేరాఫ్‌గా మారిన జగన్ రెడ్డి నీతికి నిజాయితీకి నిలువుటద్దమైన చంద్రబాబు నాయుడుపై అవినీతి మరకలు అంటించేందుకు తప్పుడు కేసులు బనాయించి అక్రమ అరెస్టులు చేయించారని దుయ్యబట్టారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నర్ రింగ్ రోడ్, ఫైబర్ గ్రిడ్ అంటూ ఒక దాని తర్వాత మరో కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితుడిని చంపి డోర్ డెలివరి చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంబాబుకు బెయిల్ ఇప్పించి బయటకు తెచ్చారన్నారు. చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటి నిరూపించలేరన్నారు.ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదని ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని వ్యాఖ్యనించారు.